సీవోఈకి గురుకుల విద్యార్థులు

ఉండవెల్లి, అక్టోబర్ 12: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి స్క్రీనింగ్ టెస్ట్‌లో విజయం సాధించి కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు మండలంలోని పుల్లూరులో గల మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల కళాశాల బైపీసీ విద్యార్థినులు మౌనిక, జ్యోతి, సౌమ్య ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ దేవానందం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి స్క్రీనింగ్ టెస్ట్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ గురుకుల విద్యార్థులు 100సీట్ల కోసం పరీక్షలు రాయగా, పుల్లూరు గురుకుల కళాశాలకు మూడు సీట్లు రావడం గర్వకారణమన్నారు. ఎంపికైన విద్యార్థులకు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి, నీట్ పరీక్షకు సిద్ధం చేస్తారని తెలిపారు.

రాజకీయ నాయకుల పోస్టర్లు తొలగింపు

గోడలపై పోస్టర్లను తొలగిస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది

వడ్డేపల్లి, అక్టోబర్ 12 : శాంతినగర్‌లో మున్సిపాలిటీ కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ సిబ్బంది గురువారం రాజకీయ నాయకుల వాల్‌పోస్టర్లు, గోడలపై ఆయా పార్టీల రాతలు, ఫ్లెక్సీలను తొలగించారు. అలాగే ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేశారు. సిబ్బంది నరేంద్ర, నరేశ్ పాల్గొన్నారు.

అయిజ కమిషనర్‌గా నిత్యానంద్

బాధ్యతలు చేపడుతున్న నిత్యానంద్

అయిజ, అక్టోబర్ 12: అయిజ మున్సిపల్ కమిషనర్‌గా నిత్యానంద్ బాధ్యతలు చేపట్టారు. పట్టణాభివృద్ధి, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గత కమిషనర్ గోల్కొండ నర్సయ్య నుంచి నిత్యానంద్ బాధ్యతలు తీసుకున్నారు.

అలంపూర్ మున్సిపల్‌కమి షనర్‌గా నర్సయ్య

అలంపూర్,అక్టోబర్12: అలంపూర్ మున్సిపల్ కమిషనర్‌గా గురువారం నర్సయ్య బాధ్యతలు చేపట్టారు. అయిజ నుంచి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న నిత్యానంద్ అయిజ మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఇరువురినీ మున్సిపల్ సిబ్బంది సన్మానించారు.

నేటి నుంచి పాఠశాలలకు దసరాసె లవులు

◆19 నుంచి కళాశాలలకు..

అయిజ, అక్టోబర్ 12: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు శుక్రవారం నుంచి ఈనెల 25 వరకు ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించింది. దీంతో గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ హాస్టళ్లను వదిలి విద్యార్థులు ఇండ్లకు వెళ్లిపోయారు. ఇప్పటికే సమ్మెటీవ్ అసెస్‌మెంట్ పరీక్షలు పూర్తి చేయడంతో, సెలవుల అనంతరం ఫలితాలను వెల్లడించాలని ప్రభుత్వం హెచ్ఎంలు, ఉపాధ్యాయులను ఆదేశించింది. ప్రభుత్వ,ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు ఈనెల 19 నుంచి సెలవులు ఇవ్వనున్నారు.

పాఠశాల నుంచి ఇండ్లకు వెళ్తున్న విద్యార్థినులు

అంబరాన్నంటిన బతుకమ్మ సంబురం

◆ ప్రభుత్వ పాఠశాలల్లో ఆడిపాడిన విద్యార్థులు ◆ ఉత్సాహంగా పాల్గొన్న ఉపాధ్యాయులు

జల్లాపురం పాఠశాలలో బతుకమ్మలతో వస్తున్న విద్యార్థినులు

బతుకమ్మ పాటకు నృత్యం చేస్తున్న శివశివాని పాఠశాల విద్యార్థులు

మానవపాడు, అక్టోబర్12: తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ ఉత్సవాన్ని జల్లాపురం, చెన్నిపాడు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. హెచ్ ఎంలు విష్ణువర్ధన్, ప్రసన్న ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారు చేశారు. అనంతరం విష్ణువర్ధన్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ చరిత్ర, విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా బతుకమ్మ పాటలకు విద్యార్థుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమరేందర్ రెడ్డి, వెంకన్న, చిన్నారెడ్డి, రాణి, శైలజ, అరవింద, సునీత పాల్గొన్నారు.

శాంతినగర్‌లో..

వడ్డేపల్లి, అక్టోబర్ 12: మున్సిపాలిటీ కేంద్రం శాంతినగర్‌లోని శివశివాని పాఠశాలలో గురువారం పాఠశాల కరస్పాండెంట్ ఈశ్వరి ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రకరకాల పూలు సేకరించి బతుకమ్మలను అలంకరించారు. వాటిని మరోచోట ఉంచి గౌరమ్మను భక్తిశ్రద్ధలతో పూజించారు. పాటలకు నృత్యాలతో పాటు కోలాటాలు వేశారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కరస్పాండెంట్ ఈశ్వరి మాట్లడుతూ ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా పూలను పూజించే పండుగ ఒక్క తెలంగాణలోనే కనిపిస్తుందన్నారు. తొమ్మిది రోజులు ఈ పండగను జరుపుకుంటారన్నారు. ఇది తరతరాలుగా మన తెలంగాణ సంస్కృతీ సంప్రదాయం అని విద్యార్థులకు తెలిపారు. అనంతరం బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయిజ మండలంలో..

అయిజ, అక్టోబర్ 12: తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని హెచ్ ఎంలు, కరస్పాండెంట్లు పేర్కొన్నారు. గురువారం పట్టణంతోపాటు మండలంలోని పలుగ్రామాల్లోని పాఠశాలల్లో ముందస్తుగా బతుకమ్మ వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి పూజలు చేశారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడారు. కార్యక్రమంలో హెచ్ఎం మధుసూదన్‌రెడ్డి, కరస్పాండెంట్లు బాలవెంకట్ రెడ్డి, మహేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయిజ: బతుకమ్మ వేడుకల్లో కృష్ణవేణి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు

అయిజ: భారీ బతుకమ్మతో బీజీఆర్ పాఠశాల విద్యార్థులు

బతుకమ్మ సంబురాల్లో సాయుధచైతన్య పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు

పదో పటాలంలో బతుకమ్మ సంబురాలు

ఎర్రవల్లి చౌరస్తా, అక్టోబర్ 12: ఎర్రవల్లి మండల కేంద్రంలోని పదో పటాలంలో గల సాయుధచైతన్య పాఠశాల, జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులు విద్యార్థులు చిన్నారుల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, చిన్నారులు తీరొక్కపూలతో బతుకమ్మలను పేర్చి ఉపాధ్యాయులు విద్యార్థులంతా ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో సాయుధ చైతన్య హెచ్.ఎం షాషావలి, వెంకటేశ్వర్లు, తిమ్మప్ప, మహముద్ బాషా, రవి, భాస్కర్, రాధ, స్కూల్ ఇన్‌చార్జి ఆంజనేయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతిపత్రాలుత ప్పనిసరి

వడ్డేపల్లి, అక్టోబర్ 12: అనుమతి పత్రాలు లేకుండా వస్తువులను, డబ్బులను, బంగారం తరలించరాదని ఎస్సై నరేశ్ అన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ.50వేలకు మించి నగదును తీసుకెళ్లరాదని, ఎక్కువ మొత్తంలో బంగారం, నిషేధిత వస్తువులను కూడా తీసుకెళ్లరాదని పేర్కొన్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తామని, పట్టుబడితే వాటిని స్వాధీనం చేసుకొని, సంబంధిత అధికారులకు పంపుతామన్నారు.

వాహనాల తనిఖీ

అయిజ, అక్టోబర్ 12: ఎన్నికల నిబంధనలు అతిక్రమించి నగదు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నరేశ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని కర్నూల్, రాయిచూర్, గద్వాల రహదారులపై వాహనాలను తనిఖీ చేశారు. రూ.50వేలకు మించి నగదును తరలిస్తే అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు వెంట తెచ్చుకోవాలన్నారు. నగదు పట్టుబడితే గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామని తెలిపారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా అయిజ పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో పోలీస్ నిఘా పెంచినట్లు ఎస్సై పేర్కొన్నారు. అక్రమంగా మద్యం, నగదు తరలిస్తే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్సై పవన్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డేపల్లిలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై నరేశ్

కలుకుంట్లలో పశువైద్య శిబిరం

మానవపాడు, అక్టోబర్12: మండలంలోని కలుకుంట్లలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. 15గేదెలు, 15ఆవులకు గర్భకోశ వ్యాధుల నివారణ టీకాలు వేశారు. వీటితో పాటు 25 ఆవుదూడలకు నట్టలమందు తాపించారు. మరో 5దూడలకు లంపీస్కిన్ చికిత్స నిర్వహించారు.

అర్హులందరికీ రుణాలు

మానవపాడు, అక్టోబర్12: పీఏసీఎస్‌లో సభ్యత్వం కలిగిన అర్హులైన రైతులకు దీర్ఘకాలిక రుణాలు అందిస్తామని పీఏసీఎస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో జిల్లా సీఈవో లక్ష్మయ్యతో పాటు మండలంలోని నాలుగు గ్రామాలకు చెందిన నలుగురికి ఆయన దీర్ఘకాలిక రుణాలను అందజేశారు. రుణాలు ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శాంతినగర్ బ్రాంచ్ మేనేజర్ జితేంద్ర, కోదండరాములు, వైస్ ప్రెసిడెంట్ అయ్యన్న, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, మద్దిలేటి పాల్గొన్నారు. అలాగే మానవపాడు పీఏసీఎస్‌లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని సీఈవో మద్దిలేటి తెలిపారు.